# బీఆర్ఎస్‌కే పట్టం కట్టండి

- సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యం
- పేదలు ఆత్మగౌరవంతో జీవించేందుకు 'డబుల్' పథకం
- 'డబుల్' ఇళ్ల ప్రారంభోత్సవంలో మంత్రి అజయ్‌కుమార్
- ఖమ్మంలో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన


క్రీడాకారులకు కిట్‌లను పంపిణీ చేస్తున్న మంత్రి పువ్వాడ అజయ్

ఖమ్మం/ రఘునాథపాలెం, అక్టోబర్ 3 : సీఎం కేసీఆర్‌తోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ పేర్కొన్నారు. ఈ అభివృద్ధి కొనసాగాలంటే మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వానికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఈ ప్రభుత్వం మళ్లీ గెలిస్తేనే అర్హులందరికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అందుతాయని అన్నారు. ఇల్లులేని నిరుపేదలు సొంతింట్లో ఆత్మగౌరవంతో జీవించాలనే సంకల్పంతోనే రాష్ట్ర ప్రభుత్వం డబుల్ బెడ్ రూం ఇళ్ల పథకానికి శ్రీకారం చుట్టిందని అన్నారు. ఖమ్మం వైఎస్ఆర్‌నగర్‌లో రూ.5.08 కోట్లతో నిర్మించిన 91 డబుల్ బెడ్ రూం ఇళ్లను, నూతన ప్రభుత్వ పాథమిక పాఠశాలను కలెక్టర్ వీపీ గౌతమ్‌తో కలిసి మంత్రి అజయ్ మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ డబుల్ బెడ్ రూం ఇళ్ల లోపలికి వెళ్లి నాణ్యతను, డిజైన్‌ను, సౌకర్యాలను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో మంత్రి మాట్లాడుతూ.. తెలంగాణలోని నిరుపేదలందరూ ఆత్మగౌరవంతో బతికేందుకు వారికి గూడు కల్పించడమే సీఎం కేసీఆర్ ఉద్దేశమని స్పష్టం చేశారు. దీంతో పేదల సొంతింటి కల సాకారమవుతోందని అన్నారు. నయా పైసా ఖర్చు లేకుండా ప్రభుత్వం అందించిన ఈ ఇళ్లను లబ్ధిదారులకు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

## సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు శంకుస్థాపన

ఖమ్మం నగరంలోని పలు డివిజన్లలో రూ.2.48 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మంగళవారం శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. 4, 30, 51, 52 డివిజన్లలో చేపట్టిన సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణాలకు మంత్రి శంకుస్థాపనలు చేశారను. 34వ డివిజన్ రంగ నాయకుల గుట్ట నిర్మించిన కొండా లక్ష్మణ్ బాపూజీ పార్కు ప్రారంభించారు. స్పోర్ట్స్ కిట్లు, టీ షర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయా కార్యక్రమాల్లో మంత్రి మాట్లాడుతూ.. ఖమ్మం నగరంలో ఇప్పటికే అన్ని రోడ్లు, కాలువల నిర్మాణాలను పూర్తి చేశామని, ఇంకా మిగిలి ఉన్న అరకొర పనులు కూడా పూర్తి చేసి నగరాన్ని మరింత సుందరంగా తీర్చిదిద్దుతామని అన్నారు. గొంగళిపురుగులా ఉన్న ఖమ్మాన్ని సీతాకోకచిలుకలా మార్చిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వానిదేనని అన్నారు. కలెక్టర్ వీపీ గౌతమ్ మాట్లాడుతూ.. జిల్లాలో 606 తెలంగాణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటుచేసినట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, బీఆర్ఎస్ నాయకులు పునుకొల్లు నీరజ, కూరాకుల నాగభూషణం, బచ్చు విజయ్‌కుమార్, బీ.సత్యప్రసాద్, ఆదర్శ్ సురభి, దండా జ్యోతిరెడ్డి, ముక్కాల కమల, బుర్రి వెంకట్‌కుమార్, రుద్రగాని శ్రీదేవి, పసుమర్తి రామ్మోహన్, రుద్రగాని ఉపేందర్, తోట వీరభద్రం, శ్యాంప్రసాద్, వాంకుడోతు సురేశ్, మోహన్, కమర్తపు మురళి, గొల్లపూడి రాంప్రసాద్, భుక్యా భాషా, అజ్మీరా వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# 'సీతారామ'తో జిల్లా సస్యశ్యామలం

- త్వరలోనే నిర్వాసితులకు పరిహారం
- రూ.1,000 కోట్లతో నియోజకవర్గ అభివృద్ధి
- పనిచేసే ప్రభుత్వాన్ని మళ్లీ ఆశీర్వదించండి
- సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర


కాకర్లపల్లిలో సీసీ రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

సత్తుపల్లి రూరల్, అక్టోబర్ 3: గోదావరి జలాలతో ఉమ్మడి జిల్లాను సస్యశ్యామలం చేసేందుకే ముఖ్యమంత్రి కేసీఆర్ సీతారామ ప్రాజెక్టును నిర్మిస్తున్నారని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు కాలువ కింద భూములు కోల్పోయిన వారిలో మిగిలిన నిర్వాసితులకు కూడా త్వరలోనే పూర్తిస్థాయిలో పరిహారం అందుతుందని అన్నారు. మండలంలోని కాకర్లపల్లి, రుద్రాక్షపల్లి, బుగ్గపాడు, రేగళ్లపాడు, యాతాలకుంట, నారాయణపురం, రేజర్ల గ్రామాల్లో మంగళవారం పర్యటించిన ఆయన.. రూ.22.50 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ సహకారంతో నాలుగున్నరేళ్ల కాలంలో రూ.1,000 కోట్ల నిధులను తెచ్చి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేశామని వివరించారు. రానున్న కాలంలో మరిన్ని నిధులు తీసుకువచ్చి నియోజకవర్గాన్ని అగ్రగామిగా నిలిపేందుకు కృషిచేస్తామని అన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని మరోసారి ఆశీర్వదించాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్ దీవెనలతో మరోసారి మీ ముందుకు వస్తున్న తనకు కూడా అత్యధిక మెజార్టీ అందించాలని కోరారు. అలాగే, నియోజకవర్గంలో దళితులందరికీ దళితబంధు వర్తింపజేస్తామంటూ ఇటీవల ఇక్కడి సభలో మంత్రి కేటీఆర్ ప్రకటించారని గుర్తుచేశారు. ఆ తరువాత గంట వ్యవధిలోనే ఆ జావో జారీ చేసిన సీఎం కేసీఆర్.. దళితుల పట్ల ప్రేమను చాటుకున్నారని కొనియాడారు. త్వరలోనే నియోజకవర్గంలోని ప్రతి దళిత కుటుంబానికీ దళిత బంధు అందుతుందని స్పష్టం చేశారు.

## టీడీపీ నుంచి బీఆర్ఎస్‌లోకి 20 కుటుంబాలు..

కాకర్లపల్లిలో టీడీపీ నుంచి 20 కుటుంబాల వారు ఎమ్మెల్యే సండ్ర సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారందరికీ ఆయన గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కాగా, మండల పర్యటనలో భాగంగా ఎమ్మెల్యే సండ్రకు గ్రామగ్రామాలన ప్రజలు, బీఆర్ఎస్ నాయకులు బతుకమ్మలు, మేళతాళాలు, కోలాట నృత్యాలు, బాణసంచాలతో ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు కొత్తూరు ఉమామహేశ్వరరావు, దొడ్డా హైమావతి, కంచర్ల రమాదేవి, తాటి మోహనరావు, కారం జయేందర్‌రావు, పూచి చిలకమ్మ, దేశిరెడ్డి రంగారెడ్డి, జక్కుల ప్రభాకర్, చల్లగుళ్ల కృష్ణయ్య, మోదుగు పుల్లారావు, తుమ్మూరు శ్రీరామప్రసాద్, యాగంటి శ్రీనివాసరావు, పెద్దిరాజు, హరికృష్ణారెడ్డి, మట్టా ప్రసాద్, కంచర్ల నాగయ్య, పాలకుర్తి రాజు, దేవరపల్లి సత్యనారాయణ, భీమిరెడ్డి గోపాలరెడ్డి, చింతల సురేందర్‌రెడ్డి, దేశిరెడ్డి సత్యనారాయణరెడ్డి, విస్సంపల్లి వెంకటేశ్వరరావు, గుర్రాల సురేశ్, నంధ్యాల వెంకటరెడ్డి, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలోనే క్రీడలకు అధిక ప్రాధాన్యం

- కిట్లు అందించి క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌దే..
- నియోజకవర్గంలో 202 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేశాం
- ప్రభుత్వ విప్ రేగా కాంతారావు


మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ రేగా కాంతారావు

మణుగూరు టౌన్, అక్టోబర్ 3: దేశంలోకెల్లా తెలంగాణలోనే క్రీడలకు, క్రీడా రంగానికి అధిక ప్రాధాన్యం లభిస్తోందని, ఊరూరా క్రీడా ప్రాంగణాల ఏర్పాటే ఇందుకు నిదర్శనమని ప్రభుత్వ విప్, పినపాక ఎమ్మెల్యే రేగా కాంతారావు పేర్కొన్నారు. కిట్లు అందించి మరీ క్రీడాకారులను ప్రోత్సహిస్తున్న ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందని స్పష్టం చేశారు. నియోజకవర్గంలోని ఏడు మండలాల్లోని క్రీడాకారులకు ప్రభుత్వం పంపిన క్రీడా కిట్లను మణుగూరులోని కిన్నెర కల్యాణ మండపంలో మంగళవారం ఆయన పంపిణీ చేశారు. తొలుత వేదికపై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆ తరువాత అదే వేదికపై క్రికెట్, వాలీబాల్ ఆడి ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా ఆయా మండలాల ప్రజాప్రతినిధులు ఆయనను శాలువాలతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సభలో రేగా మాట్లాడుతూ.. ఏజెన్సీలోని గ్రామీణ ప్రాంతాల్లో క్రీడాకారులను ప్రోత్సహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అన్ని గ్రామాల్లోనూ క్రీడా పాంగణాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 750 క్రీడా ప్రాంగణాలు ఏర్పాటు చేస్తే.. కేవలం పినపాక నియోజకవర్గంలోనే 202 క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసుకున్నామని వివరించారు. గ్రామీణ క్రీడాకారుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసేందుకు ఈ క్రీడాప్రాంగణాలు, కిట్లు ఎంతగానో దోహదపడతాయని అన్నారు. క్రీడలంటే తనకెంతో ఇష్టమని, క్రీడల విషయంలో క్రీడాకారులకు తన సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని అన్నారు. యువత క్రీడల్లో రాణిస్తూ ఈ ప్రాంతానికి మంచిపేరు తేవాలని ఆకాంక్షించారు. మణుగూరు మండలంలో రామానుజవరంలో పదెకరాల భూమిని క్రీడాప్రాంగణానికి కేటాయించినట్లు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తనను గెలిపిస్తే ఈ 202 క్రీడా ప్రాంగణాలకు మొదటి హామీ కింద రూ.లక్ష చొప్పున సీడీపీ నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. డీవైఎస్‌వో పరంధామరెడ్డి, ఆయా మండలాల ఎంపీడీవోలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, నాయకులు పాల్గొన్నారు.

# పార్టీని మరింత బలోపేతం చేయాలి

- కార్యకర్తలకు అండగా ఉంటున్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమే..
- బీఆర్ఎస్‌లో చేరికల సభలో పాలేరు ఎమ్మెల్యే కందాళ
- కూసుమంచి మండలంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన


కూసుమంచి రూరల్ : సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కందాళ

నేలకొండపల్లి/ కూసుమంచి రూరల్, అక్టోబర్ 3: పార్టీని క్షేత్రస్థాయిలో మరింత బలోపేతం చేయాలని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పిలుపునిచ్చారు. నాయకులు, కార్యకర్తలకు అండగా ఉన్న పార్టీ బీఆర్ఎస్ మాత్రమేనని స్పష్టం చేశారు. శ్రేణులు కూడా నిరంతరం శ్రమించి రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్ విజయం కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. నేలకొండపల్లి మండలం భైరవునిపల్లిలో మంగళవారం పర్యటించిన ఆయన.. గ్రామానికి చెందిన 22 కుటుంబాల వారు బీఆర్ఎస్‌లో చేరడంతో వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నేలకొండపల్లిలోని బీఆర్ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కేసీఆర్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం సదాశివపురంలో ప్రభుత్వం నుంచి లబ్ధిపొందిన వారి వివరాలు కలిగిన బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలోని ఆంజనేయస్వామి, ముత్యాలమ్మ దేవాలయాలకు విరాళం అందించారు. కోనాయిగూడెంలో చర్చిని సందర్శించి విరాళం అందించారు. చెన్నారంలో మినీ ఫంక్షన్ హాల్, పాండవుల ఆలయం, సీయోను రారాజు చర్చికి విరాళం అందించారు. శంకరగిరితండాలో రామాలయం, కట్టకొమ్ముతండాలో మేరమ్మతల్లి ఆలయాలను సందర్శించి విరాళాలను అందించారు. బీఆర్ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు ఉన్నం బ్రహ్మయ్య, మరికంటి ధనలక్ష్మి, వజ్జా రమ్య, నంబూరి శాంత, కోటి సైదారెడ్డి, ఎన్నబోయిన శ్రీను, రాయపూడి నవీన్, మరికంటి రేణుబాబు, వంగవేటి నాగేశ్వరరావు, పెద్దపాక వెంకటేశ్వర్లు, మల్లెబోయిన శ్రీను, వజ్జా శ్రీనివాసరావు, యతాకుల లక్ష్మి, యాతాకుల భాస్కర్, చాగంటి మధుసుదన్‌రావు పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట..

మారుమూల గిరిజన గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు తెలంగాణ ప్రభుత్వం అధిక ప్రాధాన్యమిస్తోందని పాలేరు ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండలంలో మంగళవారం పర్యటించిన ఆయన.. మంగలితండాలో రూ.41 లక్షలతో, బికారితండాలో రూ.15 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తండాలను పంచాయతీలుగా చేసిన ఘనత ముఖ్యమంత్రి కేసీఆర్‌దేనని స్పష్టం చేశారు. ప్రజాప్రతినిధులు, బీఆర్ఎస్ నాయకులు బానోత్ శ్రీనివాస్, ఇంటూరి శేఖర్‌రావు, వేముల వీరయ్య, ఆసిఫ్‌పాషా, తేజావత్ రాములు, కాసాని సైదులు తదితరులు పాల్గొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073
నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616